ఈబీసీ, మధ్యతరగతి ప్రజలకు శుభవార్త

ఇళ్ల నిర్మాణానికి ఆన్‌లైన్‌లో అనుమతి ● కొత్త పథకానికి సీఎం స్టాలిన్ శ్రీకారం

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందినవారు, మధ్య తరగతి ప్రజల ఇళ్ల నిర్మాణానికి ఏక గవాక్ష పద్ధతిలో ఆన్‌లైన్‌లో అనుమతి జారీ చేసే సరికొత్త పథకానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం ఉదయం సచివాలయంలో గృహవసతి, నగరాభివృద్ధి శాఖ, పట్టణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 2500 చదరపుటడుగుల నుంచి 3500 చదరపుటడుగుల దాకా ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారు (ఈబీసీలు), మధ్య తరగతి వర్గాలు ఇళ్లను నిర్మించుకునేందుకు స్వీయ దస్తావేజులను సమర్పించి ఆన్‌లైన్‌లో అనుమతి పొందే పథకానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంగా 10 మంది లబ్ధిదారులకు ఆయన భవన నిర్మాణ అనుమతి ఉత్తర్వులను పంపిణీ చేశారు. ఈ పథకం అనుమతి పొంది నిర్మించే కట్టడాలకు రహదారికి మధ్య ఉండాల్సిన ఖాళీ జాగాను 1.5 మీటర్లకు తగ్గించారు. సెక్యూరిటీ ఫీజును చదరపు మీటర్‌కు రూ.2గా, అంతర్గత నిర్మాణం, సదుపాయాల ఫీజును చదరపు మీటర్‌కు రూ.375గా నిర్ణయించారు. దరఖాస్తుదారులు అవసరమైన ఫీజులను చెల్లించిన వెంటనే క్యూఆర్ కోడ్‌తో ఇళ్ల నిర్మానానికి అనుమతి, ప్లానింగ్ సర్టిఫికేట్‌ను వెనువెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.ముత్తుసామి, పీ.కే.శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, గృహవసతి పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉషా తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో లబ్ధిదారుడికి అనుమతి పత్రాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

ప్యారీస్, జూలై 22: రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలల్లో బీఈ, బీటెక్ కోర్సులకు సంబంధించిన కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. స్థానిక గిండిలో ఉన్న సాంకేతిక విద్యా మండలి కార్యాలయంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి జనరల్ కేటగిరీలో 7.5 శాతం రిజర్వేషన్ ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ కోటా కింద 7.5 శాతం రిజర్వేషన్ సీట్లు 13,496, జనరల్ విద్యా కేటగిరీ సీట్లు 13,226, సాంకేతిక విద్య విభాగంలో 270 సీట్లకు ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. 6 నుంచి ప్లస్ టూ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ప్రభుత కోటా కింద కేటాయించిన 7.5 శాతం సీట్లకు 36,532 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో ప్రత్యేక ప్రతిభావంతుల విభాగం కింద కేటాయించిన 664 సీట్లకు 111 మంది విద్యార్థులు, క్రీడాకారుల విభాగంలో ఉన్న 38 సీట్లకు 282 మంది విద్యార్థులు, మాజీ సైనికుల వారసుల విభాగంలోని 11 సీట్లకు 11 మంది పాల్గొంటారని తెలిపారు. జనరల్ విభాగానికి సంబంధించిన కౌన్సిలింగ్ ఈ నెల 29న ప్రారంభమై మూడు విడతలుగా సెప్టెంబరు 3వ తేది వరకు కొనసాగుతుందని మంత్రి వివరించారు. జనరల్ కేటగిరీకి సంబంధించిన కౌన్సిలింగ్ ఈ నెల 29న ప్రారంభమై సెప్టెంబరు 11వ తేది వరకు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 433 ఇంజనీరింగ్ కళాశాలలున్నాయని, వీటిలో ఉన్న 2.41 లక్షల సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భరీచేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ సీట్లు ఉంటాయని అయితే, ఇష్టపడిన కళాశాలల్లో పాఠ్యాంశాలు అందుబాటులో ఉండవన్నారు. ఈ ఏడాది 8 ఇంజనీరింగ్ కళాశాలల లైసెన్స్ రద్దయిందని, ఈ కళాశాలల్లో కనీసవసతులు లేకపోవడమే కారణమన్నారు. కొత్తగా ప్రారంభించిన మూడు కళాశాలల్లో అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ప్రదీప్ యాదవ్, అన్నా వర్శిటీ వైస్ ఛాన్సలర్ సెల్వరాజ్, సాంకేతిక విద్యా మండలి కమిషనర్ అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.



గిండిలో ప్రత్యేక కేటగిరీ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభిస్తున్న ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి


కోవై జిల్లా సరిహద్దుల్లో ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీ

కేరళలో నిఫా వైరస్ ప్రభావం

రాష్ట్ర సరిహద్దుల్లో ఆరోగ్యశాఖ తనిఖీలు

మార్గదర్శకాలు విడుదల

ప్యారీస్, జూలై 22: కేరళ రాష్ట్రంలో గుర్తించిన నిఫా వైరస్ ప్రభావం వల్ల రాష్ట్ర సరిహద్దుల్లో ఆరోగ్య శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలో నిఫా వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. కేరళ రాష్ట్రం మలప్పురంలో నిఫా వైరస్ సోకి 14 ఏళ్ల బాలుడు మృతిచెందగా, మరో 60 మంది వైరస్ లక్షణాలతో బాధపడుతున్నారని తెలిసింది. దీంతో, అప్రమత్తమైన రాష్ట్రప్రభుత్వం కేరళ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జిల్లాల్లో ముందు జాగ్రత్త చర్యల్లో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ఆరోగ్యశాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, కోవై, నీలగిరి జిల్లాల్లో వాలయారు, వేలవందావనం, మాంగర్రై, మీనాక్షిపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన 11 చెక్‌పోస్టుల్లో ఆరోగ్య శాఖ అధికారులు షిఫ్టు పద్ధతిలో 24 గంటలు విధుల్లో పాల్గొంటున్నారు. కేరళ నుంచి ఈ రెండు జిల్లాల మీదుగా రాష్ట్రంలోకి వచ్చే వాహనాలకు తనిఖీ చేయడంతో పాటు ఆ వాహనాల్లో వస్తున్న ప్రయాణికులకు వైద్యపరీక్షలు నిర్వహించాకే అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో, పొరుగు రాష్ట్రం కేరళలో నిఫా వైరస్ ప్రభావం తగ్గే వరకు రాష్ట్ర ప్రజలు ఆ రాష్ట్ర పర్యటనకు వెళ్లకుండా ఉండడం మంచిదని రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు కోరుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, తల నొప్పి, శ్వాసకోశ ఇబ్బంది, కళ్లు తిరగడం వంటి లక్షణాలుండే బాధితుల నుంచి రక్తం, గళ్ల, మూత్ర నమూనాలు తీసుకుని పరీక్షల ఫలితాలు వెంటవెంటనే ప్రభుత్వానికి తెలియజేయాలంటూ జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పాదయాత్రకు

విజయ్ నిర్ణయం?

100 నియోజకవర్గాల్లో సన్నాహాలు

ఏడాది పాటు రాష్ట్ర పర్యటన



అడయార్, జూలై 22: స్టార్ హీరో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులోభాగంగా ఆయన తొలుత వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నట్లు సమాచారం. పాదయాత్రకు అవసరమైన ఏర్పాట్లు, తనతో కలిసి పాల్గొనేందుకు వీలుగా సుమారు రెండు వేల మంది క్రియాశీలక నిర్వాహకుల ఎంపిక ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నట్టు తెలుస్తోంది. 2026లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పూర్తి స్థాయిలో క్రియాశీలక రాజకీయాల్లో పాల్గొనాలని ఆయన నిర్ణయించుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో యేడాది పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్ఠం చేసే దిశగా ఆయన ప్రణాళిక రూపొందించినట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ వ్యవస్థాపక తొలి మహానాడును తిరుచ్చి లేదా మదురైలో నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ మహానాడు ముగిసిన వెంటనే ఆయన రాష్ట్ర పర్యటన చేపట్టాలని భావిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రాన్ని నాలుగు మండలాలుగా విభజించి... పార్టీ నేతలు, నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలన్న తలంపులో ఉన్నారు. కనీసం పది జిల్లాల్లో భారీ ర్యాలీలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అదేసమయంలో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పాదయాత్ర సరైన మార్గంగా భావిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 100 సెగ్మెంట్లలో పాదయాత్ర జరిపేలా సన్నాహాలు చేస్తున్నారు. పాదయాత్ర సమయంలోనే బహిరంగ సభలు నిర్వహించాలని భావిస్తున్నారు. అలాగే, పార్టీ మహానాడు ముగిసిన వెంటనే రాష్ట్ర స్థాయి నిర్వాహకులు, జిల్లా నుంచి బూత్ స్థాయి కమిటీల వరకు నిర్వాహకులను ఎంపిక చేయాలని, అదేసమయంలో పార్టీలో క్రియాశీలక సభ్య నమోదు కార్యక్రామన్ని కూడా ప్రాంభించాలని భావిస్తున్నారు. జిల్లాల వారీగా పార్టీ కార్యాలయాలను ప్రారంభించి, పార్టీని మరింతగా విస్తరించేలా ప్రణాళికలు ఖరారు చేయనున్నారు.

నిన్న చెత్త ఏరుకునే వ్యక్తి...

నేడు ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డు

అడయార్, జూలై 22: నగర వీధుల్లో చెత్త ఏరుకునే వ్యక్తి తలరాత ఒక్కరోజులో మారిపోయింది. నిన్నామొన్నటివరకు చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవిస్తూ వచ్చిన ఆ వ్యక్తి ఇపుడు ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా నెలకు రూ.12 వేతనంతో పని చేస్తున్నాడు. దీనికంతటికీ కారణం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రహ్మణం. వాకింగ్ చేస్తున్న సమయంలో తన దృష్టిలో పడిన చిత్తుకాగితాలు ఏరుకునే వ్యక్తికి ఉపాధి అవకాశం కల్పించారు. తాజాగా


రాజాతో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణ్యం

మంత్రి దృష్టిలో పడడంతో తిరిగిన దశ

వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలను పరిశీలిస్తే.. సోమవారం ఉదయం ఎప్పటిలాగే ఆరోగ్య మంత్రి సుబ్రహ్మణ్యం వాకింగ్‌కు వెళ్లారు. ఆ సమయంలో రోడ్డుపై ఉన్న చిత్తు కాగితాలను ఓ వ్యక్తి ఏరుకుంటూ మంత్రిని చూడగానే నమస్కారం చెప్పారు. సాధారణంగా ఎవరైనా నమస్కారం చెబితే ప్రతి నమస్కారం చెప్పి ముందుకు వెళ్ళిపోయే మంత్రి.. తనకు నమస్కారం చేసిన వ్యక్తి మంచి మానసిక స్థితిలో ఉన్నట్టు గ్రహించారు. ఆ వెంటనే అతనితో మాటలు కలిపి.. పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన పేరు రాజా అని, సొంతూరు తిరుచ్చి అని చెప్పారు. వీధుల్లో చిత్తు కాగితాలు ఎందుకు ఏరుకుంటున్నావంటూ ప్రశ్నించడంతో తాను అనాథ అని చెప్పాడు. నగరంలో ఏదో ఒక పని చేసుకుందామని వచ్చానని, కానీ, పని దొరకలేదని వాపోయాడు. ఆ వ్యక్తి చెప్పిన తన దీనగాథ చలించిపోయిన మంత్రి... ఏదైన పని కల్పిస్తే చేస్తావా? అని ప్రశ్నించగా, చేస్తానని చెప్పాడు. ఆ వెంటనే తన సహాయకుడి ద్వారా తన కారులోనే ఇంటికి పంపించి, శుభ్రంగా స్నానం చేయించి కొత్త దుస్తులు కొనిచ్చారు. మంత్రి తీసిచ్చిన ప్యాంటు చొక్కా ధరించగానే రాజా రూపురేఖలే మారిపోయాయి. ఆ తర్వాత గిండి లోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించగా, ఆ వ్యక్తి మానసికస్థితి, పరిపక్వతో ఉన్నట్టు వైద్యులు నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత ఆ ఆస్పత్రిలోనే నెలకు రూ.12 వేల జీతంలో సెక్యూరిటీ గార్డుగా నియమించేలా మంత్రి చర్యలు తీసుకున్నారు. తన జీవితంలో ఆకస్మికంగా జరిగిన ఈ హఠాత్ మార్పుతో రాజా కూడా నమ్మలేకపోతున్నాడు. అదేసమయంలో రాష్ట్ర మంత్రి సుబ్రహ్మణ్యంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


'మల్లర్ కంభ' విన్యాసాల్లో 1,000 మంది విద్యార్థులు

పెరంబూర్, జూలై 22: తమిళ సంప్రదాయ ప్రాచీన క్రీడ 'మల్లర్ స్తంభ (ఒకరిపై ఒకరు ఎక్కి విన్యాసాలు చేయడం)'పై ఒకేసారి 1,000 మంది విద్యార్థులు విన్యాసం చేసి అబ్బుర పరిచారు. రాష్ట్ర మల్లర్ కంభ క్రీడాకారుల సంస్థ అధ్యక్షుడు ఉలగదురై 85వ జన్మదినం సందర్భంగా విల్లుపురం కొత్త బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి దురై సెంథిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 18 జిల్లాలకు చెందిన 3 నుంచి 21 ఏళ్ల వెయ్యి మంది బాలబాలికలు ఒకే సమయంలో ఒక మల్లర్ కంభలా 10 మంది చొప్పున 100 గ్రూపులుగా ఒకరిపై ఒకరు ఎక్కి సుమారు 15 నిమిషాలు వివిధ రకాల విన్యాసాలు చేశారు.


విన్యాసాల్లో విద్యార్థులు

ఆర్‌ఎస్ఎస్‌కు దేశమే ముఖ్యం

● మోహన్ భగవత్



పెరంబూర్, జూలై 22: 'ఆర్‌ఎస్ఎస్‌కు దేశమే ముఖ్యం. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రమాదం సంభించిన ప్రతిసారీ, దేశాన్ని రక్షించేందుకు కార్యకర్తలు ముందుకొస్తారు' అని ఆ సంస్థ అధ్యక్షుడు మోహన్ భగవత్ అన్నారు. స్థానిక తిరువాన్మియూర్ లోని రామచంద్ర కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహన్ భగవత్ మాట్లాడుతూ... ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో 1928 నుంచి ప్రతి ఏడాది గురు పూజ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు కాషాయ జెండాముందు, తమను తాము సమర్పించుకుంటామని తెలిపారు. కాషాయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయం, త్యాగం, ధర్మానికి ప్రతీక అన్నారు. వ్యక్తులకు బలాలు, బలహీనతలుంటాయి, అందుకోసమే, కాషాయ జెండా, అంటే భావబాలాన్ని గురువుగా ఎగురవేస్తామని పేర్కొన్నారు.

అమ్మో.. పాములు!

● ఈ ఏడాది ఇప్పటికే 7,300 మందికి పాము కాటు
● 13 మంది దుర్మరణం




చెన్నై, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో పాములు రెచ్చిపోతున్నాయ్! మనిషి కనిపిస్తే చాలు కాటేసేందుకు సిద్ధమైపోతున్నాయి. జూన్ 30వ తేదీ నాటికి రాష్ట్రంలో 7,300 మంది పాటు కాటుకు గురైనట్లు ఆరోగ్యశాఖ చెబుతున్న గణాంకాలు ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే తక్కువే అయినా, ఈ ఏడాది ఇంతమంది పాము కాటుకు గురవడం మాత్రం భయాందోళనలు రేపుతున్నాయి. రాష్ట్రంలో విషపూరిత పాము జాతులెన్నో ఉన్నాయి. దేశంలో 250 కంటే ఎక్కువ జాతుల పాములుండగా, వాటిలో 60 మాత్రమే విషపూరితమైనవి. రాష్ట్రంలో సుమారు 20 కంటే ఎక్కువ జాతుల పాములుండగా, అందులో 4 విషపూరితమైనవని అటవీ శాఖాధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆది నుంచి అటవీ ప్రాంతాలు అధికం కావడంతో పాములూ అదే స్థాయిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది 19,795 మంది పాము కాటుకు గురి కాగా, ఇందులో 43 మంది చనిపోయారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి 7,300 మంది పాము కాటుకు గురి కాగా, 13 మంది ప్రాణాలు విడిచారు. ఇందులో అత్యధికంగా తిరువణ్ణామలై జిల్లాలో 630, కృష్ణగిరి జిల్లాలో 541, వేలూరు జిల్లాలో 358 మంది పాము కాటుకు గురైనట్లు ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

తక్షణం ప్రథమ చికిత్స...

ప్రజలు ముళ్ల పొదలు, చెట్లు, పుట్టలు, రాళ్లు, రప్పలు అధికంగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండడం మేలని వైద్య శాఖాధికారులు సూచించారు. ఎవరైనా పాము కాటుకు గురైతే పాము కరచిన భాగాన్ని శుభ్రం చేసి, ప్రథమ చికిత్స చేయాలని, ఆ వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా పాము కాటు విరుగుడుకు అవసరమైన మందు సిద్ధంగా ఉందని వారు వివరించారు.

సరికొత్త మార్గాల్లో కేటుగాళ్లు!

● కొత్త నెంబరుతో వచ్చే మెసేజ్ ఓపెన్ చేస్తే చాలు.. మీ ఖాతాలో డబ్బు గోవిందా!
● హెచ్చరిస్తున్న బ్యాంకు అధికారులు



చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అర్థంకాని విధంగా వచ్చి పడుతున్న సైబర్ నేరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం ఎంతగా మొత్తుకున్నా, ఎన్ని రకాల చర్యలు తీసుకున్నా సైబర్ నేరాలను అంచనా వేయడం, అరికట్టడం సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల మొబైల్ ఫోన్లకు వస్తున్న మెసేజ్‌లు ఓపెన్ చేస్తే చాలు మన బ్యాంకు ఖాతాలో వున్న డబ్బును సైబర్ చోరులు ఇట్టే కొట్టేస్తున్నారు. గతంలో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి, మన అకౌంట్ ఖాతా నెంబరు, లేదా ఏటీఎం నెంబరు - పాస్‌వర్డ్ తెలుసుకుని, తద్వారా డబ్బు కొట్టేసేవారు. కానీ ఇటీవల సైబర్ చోరులు మన మొబైల్‌కు పంపే మెసేజ్ ఓపెన్ చేస్తే చాలు.. ఆటోమేటిగ్గా మన ఖాతాలో వున్న డబ్బును వారు తీసుకోగలుగుతున్నారు. తాము ఎవ్వరికీ ఎలాంటి ఖాతా నెంబర్లు, పాస్‌వర్డ్ చెప్పకుండానే తమ డబ్బు మాయమైపోతోందంటూ ఇటీవ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని బ్యాంకు అధికారులు తెలిపారు. అదే విధంగా కొత్త నెంబర్ల నుంచి ఫోన్ చేసే వ్యక్తులు.. తాము ఈడీ ఆఫీసు నుంచో, సీబీఐ నుంచో, క్రైంబ్రాంచ్ నుంచో మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకుని, ఈ మధ్యకాలంలో మీ ఖాతాలో చెల్లింపులు ఎక్కువగా జరిగాయంటూ బెదరగొడుతున్నారు. ఖాతా పరిశీలించేందుకు నెంబరు అడిగి తీసుకుంటున్నారు. వారి మాటలకు భయపడి ఖాతా నెంబరు చెప్పామో అంతే సంగతులు. మన ఖాతాలో వున్న డబ్బు మరచిపోవాల్సిందే! అందుకే ఇలాంటి మోసాల పట్ల ఏమాత్రం అనుమానం కలిగినా తక్షణమే పోలీసుల్ని ఆశ్రయించాలని బ్యాంకు అధికారులు హెచ్చరిస్తున్నారు. సహజంగా బ్యాంకుల నుంచి గానీ, ఈడీ, సీబీఐ, క్రైంబ్రాంచ్‌ల నుంచి ఎవ్వరూ ఇలా ఫోన్లు చేయరని, అలాంటి అక్రమాలు ఏవైనా జరిగాయని అనుమానం వస్తే అధికారికంగా నోటీసులు పంపిస్తారే తప్ప, ఇలా ప్రైవేటు వ్యక్తులు ఫోన్ చేయరన్న విషయం గ్రహించాలని పోలీసులు సూచించారు.

సమాచార దర్శిని

నేటినుంచి అంత్యోదయ రైళ్ల రద్దు

ఐసిఎఫ్, జూలై 22: అంత్యోదయ రైళ్లను ఈనెల 23న మంగళవారం నుంచి రద్దు చేయనున్నట్లు దక్షిణరైల్వే ప్రకటించింది. తాంబరం రైల్వేయార్డులో ఈనెల 23 నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. దీంతో తాంబరం- నాగర్‌కోయిల్ - తాంబరం మార్గంలో తిరిగే అంత్యోదయ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

రేపటినుంచి చరిత్ర ఉపాధ్యాయుల సదస్సు

ఐసిఎఫ్, జూలై 22: చరిత్ర ఉపాధ్యాయుల సదస్సు స్థానిక ఎగ్మూరు మ్యూజియంలో బుధ, గురువారాల్లో జరుగనుంది. 'మన ప్రాచీన కళలు తెలుసుకుందాం' అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల చరిత్ర ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. రెండు రోజుల సదస్సులో పాల్గొనే టీచర్లకు సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

రేపు కావేరి నిర్వహణ మండలి సమావేశం

ఐసిఎఫ్, జూలై 22: ఢిల్లీలో కావేరి నిర్వహణ మండలి సమావేశం ఈనెల 24న బుధవారం జరగనుంది. ఈ సమావేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు పాల్గొననున్నారు. సమావేశంలో కర్ణాటక ప్రభుత్వం విడుదల చేయవలసిన కావేరి జలాలపై అధికారులు చర్చించనున్నారు.

విమానాశ్రయంలో ఉచిత బ్యాటరీ వాహన సేవలు

ఐసిఎఫ్, జూలై 22: చెన్నై విమానాశ్రయం నుంచి మెట్రోరైల్వే స్టేషన్ వెళ్లేందుకు ఉచిత బ్యాటరీ వాహన సేవలు అందుబాటులోకి వచ్చాయి. విమానాశ్రయం నుంచి మెట్రోరైల్వే స్టేషన్, అక్కడి నుంచి విమానాశ్రయం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ సేవలను అధికారులు ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో వుంటాయి.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల పరీక్ష వాయిదా

పెరంబూర్, జూలై 22: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 4,000 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ఆగస్టు 4వ తేది రాతపరీక్ష నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) ఇదివరకే ప్రకటించింది. ఈ నేపథ్యంలో, నిర్వహణ కారణాల రీత్యా పరీక్ష వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. తదుపరి నిర్వహించే పరీక్ష తేది త్వరలో ప్రకటిస్తామని టీఆర్బీ తెలిపింది.

నేటినుంచి దివ్యాంగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

ఐసిఎఫ్, జూలై 22: వైద్యానికి సంబంధించిన డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు స్థానిక కీల్పాక్కంలో మంగళవారం నుంచి గురువారం వరకు జరుగనున్నాయి. బీఎస్సీ నర్సింగ్, బీఫార్మ్ వంటి 19 వైద్య కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ గత మే 23 నుంచి జూన్ 21వ తేదీ వరకు జరిగింది. దివ్యాంగుల విభాగానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మంగళవారం నుంచి 25వ తేదీ వరకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఆ విద్యార్థుల జాబితాను అధికారులు విడుదల చేశారు.

ఖైదీ మృతి కేసులో సీఐ సహా పలువురికి 33 ఏళ్ల జైలు

వేలూరు, జూలై 22: స్థానిక మేలప్పాడి పోలీస్‌స్టేషన్‌లో విచారణ ఖైదీ మృతి కేసులో సీఐ సహా పలువురికి 33 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ వేలూరు కోర్టు తీర్పు వెలువరించింది. శిక్ష పడిన సీఐ మురళీధరన్ ప్రస్తుతం వేలూరు ఎక్సైజ్ సీఐగా పని చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వేలూరు, జూలై 22: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో మోటర్ సైకిల్ ఢీకొని యువకుడికి గాయాలయ్యాయి. మద్యం తాగి మోటర్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు యువకులు రోడ్డు దాటుతున్న యువకుడిని ఢీకొట్టారు. ఈ ఘటనలో యువకుడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అనంతరం సదరు యువకులు తప్పించు పారిపోయారు. వేలూరు డీఎస్పీ తిరునావుక్కరసర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, మోటర్ సైకిల్‌కు నెంబర్ లేదని గుర్తించారు. ఈ ఘటనపై వేలూరు దక్షిణం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బస్టాప్ ప్రారంభించిన దివ్యాంగుడు

పెరంబూర్, జూలై 22: తంజావూరు జిల్లా కుంభకోణం కళాశాల రోడ్డులో నిర్మించిన బస్టాప్‌ను దివ్యాంగ యువకుడు ప్రారంభించడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యే అన్బళగన్, తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఈ బస్టాప్ నిర్మాణానికి రూ.4.75 లక్షలు కేటాయించారు. నిర్మాణాలు పూర్తికావడంతో ఆదివారం బస్టాప్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అదే ప్రాంతాని చెందిన బధిరుడు, మూగవాడైన దివ్యాంగుడు హరిహరన్ (22) కత్తెర అందజేసి రిబ్బన్ కట్ చేసి బస్టాప్‌ను ప్రారంభింపజేశారు.

పారిశుధ్య కార్మికుడి నిజాయితీ

● చెత్తలో దొరికిన రూ.5 లక్షల నగ యజమానికి అప్పగింత



పెరంబూర్, జూలై 22: చెత్తకుప్పలో దొరికిన రూ.5 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్‌ను యజమానికి అప్పగించిన పారిశుధ్య కార్మికుడిని అందరూ అభినందించారు. కేకే నగర్ సైదాబ్‌పేటకు చెందిన అంథోనిస్వామి పారిశుధ్య కార్మికుడు. ఆయన కోడంబాక్కం 137వ వార్డులో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తుంటాడు. సోమవారం ఉదయం కేకేనగర్ రాజమన్నార్ రోడ్డులోని ఇళ్లలో చెత్త సేకరించారు. ఆ ప్రాంతంలోని 'విండర్స్ పార్క్' అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సంగీత దర్శకుడు ఆర్.దేవరాజ్ (60) తన ఇంట్లో రూ.5 లక్షలు విలువచేసే నెక్లెస్ కనిపించడం లేదని, తాను వేసిన చెత్తలో అదేమైనా ఉందా అని చూడాలంటూ అంథోనిస్వామిని కోరాడు. 500 కిలోల చెత్తను బహిరంగ ప్రాంతంలో కుమ్మరించి వెతకాలంటే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని భావించిన అంథోనిస్వామి ఈవిషయాన్ని అధికారులకు తెలియజేశారు. వార్డు సూపర్‌వైజర్లు అజయ్, జోసెఫ్ పర్యవేక్షణలో ఆ ప్రాంతంలోని బహిరంగ ప్రదేశంలో చెత్తను పోసి, గంట పాటు గాలించి, పూలదండలో చిక్కుకున్న నెక్లెస్ గుర్తించి దేవరాజ్‌కు అప్పగించారు. నెక్లెస్ అప్పగించిన అంథోనిస్వామికు దేవరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

అసెంబ్లీలో గుట్కా ప్యాకెట్ల ప్రదర్శన కేసు

● స్టాలిన్ సహా 14 మందికి హైకోర్టు నోటీసులు



చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను ప్రదర్శించిన కేసులో ముఖ్యమంత్రి స్టాలిన్ సహా 14 మందికి స్పీకర్ ద్వారా నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ధర్మాసనం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఉదయం ఈ కేసుపై తీర్పు వెలువరించే సమయంలో అడ్వకేట్ జనరల్ మునుపటి అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 14 మందికి నోటీసులు జారీ చేయకుండానే అప్పీలు పిటిషన్‌పై విచారణను కొనసాగించినట్లు పేర్కొనడంతో ధర్మాసనం ప్రతివాదులందరికీ నోటీసులు పంపి, వారి అభిప్రాయాలను తెలుసుకున్న మీదటే తీర్పు వెలువరించాలని నిర్ణయించింది. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో శాసనసభలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను ప్రదర్శించారని అప్పట్లో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ సహా డీఎంకే శాసనసభ్యులకు అసెంబ్లీ హక్కుల సంఘం సభా హక్కుల ఉల్లంఘటన నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుల్లో తప్పిదాలు ఉన్నాయంటూ హైకోర్టు వాటిని రద్దు చేసింది. ఈ వ్యవహారంలో హక్కుల ఉల్లంఘన జరిగినట్లు భావిస్తే మళ్లీ నోటీసులు పంపి చర్యలు తీసుకోవచ్చంటూ పేర్కొంది. దీంతో హక్కుల సంఘం, డీఎంకే శాసనసభ్యులు మళ్లీ నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను వ్యతిరేకిస్తూ స్టాలిన్ సహా డీఎంకే శాసనసభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు రెండో నోటీసును కూడా రద్దు చేసింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలోని శాసనసభ కార్యదర్శి, సభా హక్కుల సంఘం తరఫున హైకోర్టులో అప్పీలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, సి.కుమరప్పన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతూ వచ్చింది. ఆ విచారణకు హాజరైన అడ్వకేట్ జనరల్ పీఎస్‌రామన్ ఈ నోటీసుల వ్యహారంలో తదుపరి చర్యలపై ప్రస్తుత శాసనసభ స్పీకర్ మాత్రమే నిర్ణయం తీసుకోగలరని, కనుక ఆయన నిర్ణయానికే వదలిపెట్టాలని కోరారు. ఆ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తులు శాసనసభ, న్యాయస్థానానికి ఉన్న అధికారులు ఏమిటో స్పష్టంగా రాజ్యాంగంలో పేర్కొన్నారని, కనుక ఈ రెండు సంస్థలు ఒకదాని అధికారంలో మరొకటి జోక్యం చేసుకోకూడదన్నారు. సభా హక్కుల ఉల్లంఘటన నోటీసులపై తుది నిర్ణయం తీసుకోని పరిస్థితుల్లో తాము ఈ వివాదంలో జోక్యం చేసుకోలేమని, అలా జోక్యం చేసుకుంటే అది తప్పుడు ఉదాహరణగా మారుతుందన్నారు. ఈ వ్యవహారంలో కొత్తగా ఏర్పాటైన శాసనసభ నిర్ణయానికే వదిలిపెడతామని పేర్కొంటూ కేసు తీర్పును తేదీని ప్రకటించకుండా వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం హైకోర్టు ధర్మాసనం తీర్పును ప్రకటించేందుకు సిద్ధమవుతుండగా అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ హాజరై ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న 18 మందిలో నలుగురికి మాత్రమే నోటీసులు పంపారని, తక్కిన 14 మందికి ఇప్పటిదాకా నోటీసులు పంపలేదని, ఈ కేసులో ప్రస్తుతం తీర్పును వెలువరిస్తే వారు అప్పీలు చెల్లుబాటు అయినప్పుడు తమ వాదనలు వినకుండానే హైకోర్టు తీర్పు వెలువరించిందని చెబుతూ ఓ నిర్ణయానికి వస్తారని, అందువల్ల అందరికీ (18 మందికి) నోటీసులు పంపి వారి అభిప్రాయాలను తెలుసుకున్న మీదటే ఈ కేసులో తీర్పు వెలువరిస్తే సమంజసంగా ఉంటుందని పేర్కొన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఈ అప్పీలు పిటిషన్లు దాఖలు చేసినప్పుడు అప్పటి పాలకులు నోటీసులు పంపకుండానే కేసును నడిపారని, ఈ విషయాన్ని తాను గమనించకపోయినందుకు క్షమాపణలు చెప్పుకుంటానని పేర్కొన్నారు. వెంటనే న్యాయమూర్తులు దస్తావేజులను తిరగేసి ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కూడా పంపలేదని, నోటీసు పంపకపోవడానికి ఆయన అందుబాటులో లేదంటూ ముద్రించి ఉందని తెలిపారు. ప్రతివాదులు అందరూ ప్రముఖులేనని, కనుక ముఖ్యమంత్రి స్టాలిన్ సహా 14 మందికి ఎలక్ట్రానిక్ పద్ధతిలోనో లేక నేరుగానో నోటీసులు జారీ చేయాలని, ఆ నోటీసులు స్వీకరించిన మీదట ఈ నెల 25న తమ తరఫున వాదనలను ధర్మాసనం ముందుంచాలని, కేసు విచారణను కూడా అదే రోజుకు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తులు ప్రకటించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 22: లైన్లలో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని టీఎస్‌ఈబీ అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే...

షోళింగనల్లూర్: పళ్లిక్కరణై, ఐటీ కాలనీ, కామకోటి నగర్, ఏజీఎస్ కాలనీ, వీజీపీ శాంతి నగర్, అయ్యప్పన్ వీధి, ఇళంగో వీధి, అవ్వై వీధి, భారతి వీధి, లేబర్ కాలనీ, చర్చి అవెన్యూ, కవిమణి వీధి, ఇందిరా వీధి, పుదుతాంగల్, తంగం నగర్, సాయిబాబా నగర్, సాయి బాలాజీ నగర్, శివష్ అవెన్యూ, ట్రాపికల్ ఎన్‌క్లేవ్, మల్లికేశ్వరన్ నగర్, వెంకటేశ్వరా నగర్, జయపాల్ నగర్, జల్లడియాన్‌పేట, రాఘవేంద్రా నగర్, కలర్‌హోమ్స్, పెరుంబాక్కం మెయిన్‌రోడ్డు, శేఖరన్ నగర్, వీజీపీ ప్రభు నగర్, ఏరిక్కరై వీధి, ఇండియా బుల్స్, వీరాత్తమ్మన్ కోయిల్ వీధి, గ్రీన్‌కోర్టు, జగన్నాధపురం.

మైలాపూర్: లజ్ ప్రాంతం, రాయపేట హైరోడ్డు, కచ్చేరి రోడ్డు, మందవెల్లి ప్రాంతం, సీవీ రామన్ రోడ్డు, కర్పగాంబాళ్ నగర్, సీఐటీ కాలనీ, కాట్టుకోయిల్, దేశికారోడ్డు, ఎంకే అమ్మన్ కోయిల్ వీధి, లోకనాధన్ కాలనీ, సీపీ రామస్వామి రోడ్డు, దేవకి వీధి, ఈస్ట్ అభిరామపురం 1-3 వీధులు, ఆలివర్ రోడ్డు, విశ్వేస్‌పురం, మైలాపూర్ ప్రాంతం మొత్తం, కపాలీ గార్డెన్, పల్లకు మానియం, వారన్‌రోడ్డు, రంగా రోడ్డు.

అన్నానగర్: పీసీ హాస్టల్ రోడ్డు, హారింగ్టన్ రోడ్డు, పాత షెనాయ్ నగర్, గురుస్వామి రోడ్డు, చెట్‌పేట్ జగన్నాధపురం, మంగళాపురం, స్కూల్ రోడ్డు, బృందావనం వీధి, వల్లువర్‌కోట్టం రోడ్డు, నుంగంబాక్కం హైరోడ్డు, సీతానగర్ 2వ వీధి, వీట్‌క్రాఫ్ట్ రోడ్డు, శివగంగ రోడ్డు, కొఠారి రోడ్డు, జయలక్ష్మీపురం, పెన్నంగిపురం, అప్పు వీధి.

మధురవాయల్: వానగరం, చెట్టియార్ అగరం, ఏరిక్కరై వీధి, మూర్తి నగర్, తిరువికా నగర్, అగ్ని బ్యారీల్యాండ్, కుండలం, శుభగిల్ నగర్, మహాలక్ష్మి నగర్.

ఐటీసీ: ఒగ్గియం దురైపాక్కం, సాయినగర్ 1-13వ క్రాస్ స్ట్రీట్ వరకు, సాయినగర్ 1 నుంచి 3వ మెయిన్‌రోడ్డు వరకు, సెల్వగణపతి అవెన్యూ, సెల్వకుమార్ అవెన్యూ, ఆర్ముగం అవెన్యూ, బెత్లేల్ నగర్, శరవణనగర్ 3, 4 వీధులు, కార్పొరేషన్ రోడ్డు ప్రాంతం.

తిరువాన్మియూరు: కొట్టివాక్కం, శాస్త్రినగర్, తిరువాన్మియూరు ట్యాంక్, తూర్పు మాడవీధి, ఉత్తర మాడవీధి, భారతీదాసన్ వీధి, ఈసీఆర్ ప్రాంతం, లలితా గార్డెన్, కుప్పం బీచ్‌రోడ్డు ప్రాంతం, దక్షిణ మాడవీధి, పశ్చిమట్యాంక్ వీధి, సన్నిధి వీధి, మేట్టువీధి.

అడయార్: బీసెంట్‌నగర్, ఎంజీ రోడ్డు ప్రాంతం, సీతారామనగర్, భువనేశ్వరి నగర్, నాదం సుబ్రమణి కాలనీ, వీజీపీ సెల్వా నగర్, బెత్లేల్ అవెన్యూ, ముత్తుకృష్ణన్ వీధి, కత్తిపారా, వేళచ్చేరి మెయిన్‌రోడ్డు, గురునానక్ కాలేజీ, స్కూలు, నరేంద్ర నగర్, అన్నా నగర్.

తాంబరం: ఇరుంబులియూర్, ఎయిర్‌ఫోర్స్ ప్రాంతం, సుందరం కాలనీ, భారతమాత వీధి, వాల్మీకి వీధి, ఏరిక్కరై వీధి, తిరువళ్లువర్ వీధి, కందస్వామి కాలనీ, ఎల్ఐసీ కాలనీ, కులశేఖరన్ వీధి, కాశియప్పర్ వీధి, సుందరం కాలనీ, ఈస్ట్ తాంబరం, సదానంద భారతి నగర్, గణపతిపురం, శర్మ వీధి, మురుగేశన్ వీధి, హూండిబజార్, వేళచ్చేరి మెయిన్‌రోడ్డు, ఆంథోనీ వీధి, రాజేంద్ర నగర్, సాలమన్ వీధి, క్లబ్ రోడ్డు, కల్పనా నగర్, కృష్ణానగర్, ఆంజనేయ కోయిల్ వీధి, కాలమేఘం వీధి, అగస్త్యర్ వీధి, నాల్వర్ వీధి, మోహన్ వీధి, భరద్వాజ వీధి, కంబర్ వీధి, పోరూర్ వీధి, మణిమేఘలై వీధి, చక్రవర్తి వీధి, కర్పగవినాయగర్ వీధి, ఇరుంబులియూర్, సెల్లియమ్మన్‌కోయిల్ వీధి, అరుళ్ నగర్, బాలాజీ నగర్, రోజా గార్డెన్, పొన్నన్ నగర్, తిరువళ్లువర్‌వీధి, కేకే వీధి, శ్రీరాం నగర్, దేవనేశన్ నగర్, ఆర్తీ నగర్, ప్రొఫెసర్స్ కాలనీ, ఆనందపురం, అత్తినగర్, వినోబా నగర్, ఐఏటీ రోడ్డు.

అంబత్తూర్: పాడి, అన్నానగర్, సుబ్బలక్ష్మి నగర్, రాజీవ్ నగర్, బాలాజీ నగర్, వైగై నగర్, పొన్నియమ్మన్ నగర్, వెళ్లాలర్ వీధి, స్కూల్ వీధి, ఇందిరా గాంధీ వీధి, ఇరుళర్ వీధి, పీకేఎం రోడ్డు, యట్టీశ్వరన్ కోయిల్ వీధి, వైష్ణవి నగర్, కొరట్టూర్ సావడి వీధి, జంబుకేశ్వర్ నగర్, మారియమ్మన్ కోయిల్ వీధి, వన్నియార్ 1వ వీధి, భారతి నగర్, గ్రామణి వీధి, కొరట్టూర్, కేవీ పాడి, కొరట్టూర్ సెంట్రల్ అవెన్యూ, తూర్పు అవెన్యూ, పశ్చిమ అవెన్యూ, పీఎస్‌హెచ్‌వీ 26వ వీధి నుంచి 55వ వీధి వరకు, కొరట్టూరు కామరాజర్ నగర్, కన్నగి నగర్, వాంచి నగర్, టీఎస్‌హెచ్‌పీ క్వార్టర్స్ 1 నుంచి 20వ వీధి వరకు, శాంతి నగర్.

న్యాయవాదుల ఘర్షణ

సుమోటో కేసుగా స్వీకరించిన న్యాయస్థానం

పెరంబూర్, జూలై 22: స్థానిక ఎగ్మూర్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు పరస్పర దాడులకు పాల్పడిన వ్యవహారాన్ని మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం సుమోటాగా విచారించేందుకు అంగీకరించింది. ఎగ్మూర్ కోర్టులో విచారణలో ఉన్న ఓ కేసును మరో న్యాయవాది చేపట్టనున్నారనే వార్తల నడుమ, ఈనెల 19వ తేదీ ఎగ్మూర్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు 20 మందిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో, న్యాయవాదుల పరస్పర దాడులను న్యాయస్థానం తనకు తానుగా ముందుకొచ్చి విచారించాలంటూ మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణన్‌కుమార్, న్యాయమూర్తి కుమరేశ్‌బాబుతో కూడిన ధర్మాసనం ముందు ఓ న్యాయవాది విన్నవించారు. అందుకు అంగీకరించిన న్యాయస్థానం, న్యాయవాదుల దాడుల కేసును సుమోటో కేసుగా విచారించేందుకు అంగీకరించింది.

పెనుగాలికి కూలిన స్కూలు ప్రహరీ



చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్ పరిసరాల్లో సోమవారం వేకువజాము వీచిన పెనుగాలులకు గుండుపట్టి పంచాయతీ మాధ్యమిక స్కూలు ప్రహరీ కొంత భాగం కూలింది. ఆ స్కూలుకు వెళ్లిన బాలబాలికలు ఆ దృశ్యాన్ని చూసి దిగ్భ్రాంతి చెందారు. ఈ దుర్ఘటన జరిగినప్పుడు విద్యార్థులెవరూ గోడకు సమీపంలో లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

రక్తపు చుక్కతో జీవక్రియ రుగ్మతలు గుర్తించవచ్చు

ప్రముఖ వైద్య నిపుణుడు అనిల్ జలన్

అడయార్, జూలై 22: ఒక్క రక్తపు చుక్కతో నవజాత శిశువుల్లో జీవ, మానసిక రుగ్మతలను గుర్తించవచ్చని శ్రీరామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చికి చెందిన డాక్టర్ అనిల్ జలన్ పేర్కొన్నారు. ఈ ఇనిస్టిట్యూట్‌లో 'నవజాత శిశువులు - జీవక్రియ రుగ్మతలు' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు జరిగింది. ఇందులో ప్రముఖ పీడియాట్రిషియన్, మెటాబాలిక్, జెనెటిక్ కౌన్సెలర్ డాక్టర్ అనిల్ జలన్ పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. దేశంలో యేటా 2700 మందికిపైగా నవజాత శిశువులు వివిధ రకాలైన జీవక్రియ రుగ్మతల బారిన పడుతున్నారని తెలిపారు. వీటిలో 55 రకాలైన రుగ్మతలను రక్తపు చుక్కతో గుర్తించవచ్చని తెలిపారు. ఒక చుక్క రక్తాన్ని గ్రామాల్లో ఉండే ప్రజా ఆరోగ్య కేంద్రాల్లో సేకరించి, అలా సేకరించిన రక్తాన్ని టిష్యూ పేపరుపై వేసి, ఎండబెట్టి, మంచి పరిశోధనా కేంద్రానికి పంపడం వల్ల కొంతమంది నవజాత శిశువుల్లో తీవ్రమైన మానసిక, జీవక్రియ రుగ్మతలను గుర్తించవచ్చని తెలిపారు. ఈ సదస్సులో రామచంద్ర మెడికల్ సెంటర్ నియోనేటాలజీ విభాగాధిపతి బి.ఉమామహేశ్వరి మాట్లాడుతూ... తమ సెంటరులో దాదాపు 1400 మందికి ఈ తరహా స్క్రీనింగ్ చేసినట్టు తెలిపారు.

ప్రజలకు ఎంపీ కదిర్ ఆనంద్ కృతజ్ఞతలు



గుడియాత్తం యూనియన్ గ్రామాల్లో పర్యటిస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, జూలై 22: ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో వేలూరు నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ విజయం సాధించారు. తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేలా ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆ ప్రకారం, సోమవారం గుడియాత్తం దక్షిణ యూనియన్ పార్టీ సెక్రటరీ సత్యానందం, పార్టీ నేతలు, కార్యకర్తలతో పుట్టవారిపల్లి, వీరిశెట్టిపల్లి, రామాలై, కొండ సముద్రం తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చారు.

కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 22: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కలియమూర్తి సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లత్తేరిలో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వేలూరు, జూలై 22: స్థానిక కాట్పాడి లత్తేరిలో అపోలో రక్త పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జైన్ క్లినిక్ వైద్యులు, ప్రజలకు మధుమేహం, రక్తపోటు, ఊబకాయం బాధితులను పరీక్షించి, సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులు అందజేశారు.

మితిమీరిన వేగంతో ప్రైవేటు బస్సు \ అడ్డుకున్న ప్రజలు



బస్సును అడ్డుకున్న విద్యార్థులు

వేలూరు, జూలై 22: స్థానిక కాట్పాడి రోడ్డులో సోమవారం అతివేగంగా వచ్చిన ప్రైవేటు బస్సును ప్రజలు అడ్డుకున్నారు. రంగాలయ కల్యాణ మండపం ప్రాంతంలో ఉదయం ప్రజలు, విద్యార్థులు పెద్దసంఖ్యలో వెళుతున్నారు. ఆ సమయంలో అతివేగంగా వచ్చిన బస్సుతో ప్రజలు భయభ్రాంతులయ్యారు. పట్టణంలో అంత వేగంతో వెళ్లాల్సిన అవసరం ఎందుకు అని బస్సు సిబ్బందిని ప్రశ్నించారు. అంతలో కొందరు యువకులు బస్సు అద్దాలు పగులగొట్టారు. దీంతో, ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

కోయంబత్తూరులో ఆమ్నీ బస్సు దగ్ధం



దగ్ధమైన ఆమ్నీ బస్సు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పీలమేడు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఓ ఆమ్నీ బస్సు దగ్ధమైంది. తిరువణ్ణామలై నుంచి 40 మంది ప్రయాణికులతో ఓ ఆమ్నీ బస్సు బయలుదేరింది. ఆ బస్సును దాస్, ఉస్మాన్ అనే డ్రైవర్లు నడిపారు. ఆ బస్సు కోయంబత్తూరు నగరానికి చేరుకుంటుండగా అక్కడక్కడా ప్రయాణికులను దింపుకుంటూ పీలమేడుకు చేరుకుంది. ఈక్రమంలో ఓ స్టాపింగ్ దగ్గర ఉన్నట్టుండి బస్సు డీజిల్ పైప్‌లో నుంచి నిప్పురవ్వలు చెలరేగాయి. క్షణాలలో మంటలు వ్యాపించాయి. వెంటనే డ్రైవర్లు బస్సును నిలిపి ప్రయాణికులను కిందకు దింపారు. ఆ తర్వాత బస్సు నలువైపులా నిప్పుమంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయినప్పటికీ బస్సు కాలి బూడిదైంది. పీలమేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

రూ.75లక్షల విలువైన బీడీ ఆకుల బస్తాల పట్టివేత

ఇద్దరి అరెస్టు - ఫైబర్ పడవ స్వాధీనం



క్యూ బ్రాంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫైబర్ పడవ

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సమీపంలో శ్రీలంకకు బీడీ ఆకులను తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని క్యూ బ్రాంచి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.75లక్షల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. కల్లామొళి గ్రామ సముదతీరంలో శ్రీలంకకు బీడీ ఆకుల బస్తాలు తరలిస్తున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. దీంతో తూత్తుకుడి క్యూ బ్రాంచి సీఐ విజయ్‌అనితా, ఎస్ఐలు జీవమణి, ధర్మరాజ్, సెల్వకుమార్, రామచంద్రన్, స్పెషల్ ఎస్ఐ రామర్ సహా కానిస్టేబుళ్ల తనిఖీలు చేపట్టారు. సోమవారం వేకువజాము రెండు గంటలకు అనుమానాస్పదంగా వచ్చిన లోడ్ వ్యాన్‌ను నిలిపి సోదా చేశారు. ఆ వ్యాన్‌లో సుమారు 30 కిలోల బరువుగల 106 బీడీ బస్తాలు ఉన్నాయి. వాటి విలువ రూ.75 లక్షలని పోలీసులు తెలిపారు. ఆ వ్యాన్‌లో ప్రయాణించిన శివగంగ జిల్లాకు చెందిన అరుళ్ విజయకాంత్, తిరునల్వేలి జిల్లాకు చెందిన పాండ్యన్‌ను అరెస్టు చేశారు. ఆ బీడీ ఆకుల బస్తాలను పడవలో శ్రీలంకకు తరలించేందుకు తీసుకెళుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఆ మేరకు పోలీసులు సముద్రతీర ప్రాంతానికి వెళ్లి బీడీ ఆకుల బస్తాలను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఫైబర్ పడవను కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు

ఐదుగురిని విచారించనున్న పోలీసులు

అడయార్, జూలై 22: బీఎస్పీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టైన నిందితుల్లో ఐదుగురిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని సెంబియం పోలీసులు భావిస్తున్నారు. ఇందుకోసం కోర్టులో కస్టడీ పిటిషన్ వేసేందుకు అవసరమైన న్యాయ చర్యలను చేపట్టారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో సెంబియం పోలీసులు ఇప్పటివరకు 16 మందిని అరెస్టు చేశారు. వీరిలో అన్నీ పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారు. ఇప్పటికే 11 మందిని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపారు. అయితే, ఈ హత్య కేసులో మరో కేసులో జీవితశిక్ష పడి జైల్లో ఉంటున్న ఉత్తర చెన్నైకు చెందిన ప్రముఖ రౌడీకి సంబంధం ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. అందువల్ల పోలీసులు అరెస్టు చేసిన పొన్నై బాలు, అరుళ్, న్యాయవాది హరిహరన్ సహా ఐదుగురిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని భావిస్తున్నారు. విచారణలో ఈ హత్య కేసుకు సంబంధించి మరికొన్ని కొత్త విషయాలు వెలుగులోకి రావొచ్చని సెంబియం పోలీసులు భావిస్తున్నారు. దీంతో వారిని కస్టడీలోకి తీసుకునేందుకు కోర్టును ఆశ్రయించనున్నారు.

నలుగురికి పోలీసు కస్టడీకి కోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జూలై 22: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన నలుగురిని పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఎగ్మూర్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అరెస్టయిన హరిహరన్‌కు నాలుగు రోజులు, బాలు, రాము, అరుళ్‌ను తలా మూడు రోజులు పోలీసులు విచారించేందుకు కోర్టు అంగీకరించింది. కాగా, హరిహరన్‌ను 7 రోజులు, మిగిలిన ముగ్గుర్నీ 5 రోజులు తమ కస్టడీకి అప్పగించాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆనందన్ నియామకం

సమన్వయకర్తగా పొర్కొడి ఆమ్‌స్ట్రాంగ్



ఆనందన్, పొర్కొడి

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఆనందన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ప్రకటన జారీ చేసింది. ఈ నెల 5వ తేది రాత్రి ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు గురికావటంతో ఈ పదవికి ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆనందన్ నియమితులయ్యారు. 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తిరువళ్లూరు నియోజకవర్గం నుంచి ఆనందన్ బీఎస్పీ తరఫున పోటీ చేశారు. ఆనందన్ సుప్రీంకోర్టు న్యాయవాదిగా ఉంటూ ఆమ్‌స్ట్రాంగ్‌కు సంబంధించిన కేసులన్నింటిలో వాదిస్తున్నారు. పార్టీ అభివృద్ధి కోసం ఆమ్‌స్ట్రాంగ్‌తో కలిసి కృషి చేశారు. ఇక బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్తగా ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి, న్యాయవాది పొర్కొడి నియమితులయ్యారు. పార్టీ ఉపాధ్యక్షుడిగా ఇలమారన్ శేఖర్, కోశాధికారిగా కమల్‌వేల్ సెల్వన్‌ను నియమించినట్లు పార్టీ అధిష్టానం ప్రకటించింది.

భార్యను చంపిన భర్త

ప్యారీస్, జూలై 22: ఈరోడ్ జిల్లా గాంగేయం సమీపంలోని సుక్కుపట్టిపాళయంలో సోమవారం ఉదయం భార్యను హతమార్చిన భర్త పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. తిరుచ్చి జిల్లా లాల్‌గుడికి చెందిన శివకుమార్, నర్మద ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా వీరు మూడేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. సుక్కుపట్టిపాళయంలో ఉన్న ఓ రైస్ మిల్లులో నర్మద పనిచేస్తోంది. అదే ప్రాంతంలోని ఓ అద్దె ఇంట్లో శివకుమార్ ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం కుమారుడు కుబేంద్రన్ జన్మదిన వేడుకలు జరుపుకొనేందుకు భార్య ఉంటున్న ఇంటికి వెళ్లిన శివకుమార్, ఆమెతో గొడవపడినట్లు తెలిసింది. దీంతో ఆవేశం చెందిన శివకుమార్ కత్తితో నర్మదను హతమార్చి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

చెట్టును ఢీకొన్న కారు

తండ్రి, కుమార్తె సహా ముగ్గురి మృతి

ప్యారీస్, జూలై 22: తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో చెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో తండ్రి, కుమార్తె సహా ముగ్గురు మృతిచెందగా, భార్య, కుమారుడి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈరోడ్ జిల్లా సూలై ప్రాంతానికి చెందిన కృష్ణకుమార్ (40), మోహన (39) దంపతులకు కుమారుడు సుదర్శన్(15), కుమార్తె వరుణ(10) ఉన్నారు. కృష్ణకుమార్ కుటుంబసభ్యులు, అత్త ఇంద్రాణితో కలసి కారులో తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లి ఆదివారం దర్శనం చేసుకున్నారు. రాత్రి ఈరోడ్‌కు వారు తిరుగుముఖం పట్టారు. కారును కృష్ణకుమార్ నడిపారు. మదురై-కరూర్ జాతీయ రహదారిలో అరవకురిచ్చి సమీపంలో ఉన్న ఆండిపట్టి కోట ప్రాంతానికి తెల్లవారుజామున చేరుకున్న సమయంలో, అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. ఇందులో కృష్ణమోహన్, వరుణ, ఇంద్రాణి తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మిగిలిన వారికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మాజీ మంత్రి విజయభాస్కర్‌కు రెండు రోజుల పోలీసు కస్టడీ

పెరంబూర్, జూలై 22: అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్‌ను రెండు రోజులు పోలీసు విచారణకు అనుమతిస్తూ సీబీసీఐడీ కరూర్ క్రిమినల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రూ.100 కోట్ల భూ ఆక్రమణ కేసులో అదృశ్యమైన ఎమ్మార్ విజయభాస్కర్‌ను ఈనెల 16న కేరళలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన్ను రెండు రోజులు విచారించేందుకు తమకు అప్పగించాలని సీబీసీఐడీ పోలీసులు దాఖలుచేసిన పిటిషన్ సోమవారం విచారించిన న్యాయమూర్తి భరత్‌కుమార్, విజయభాస్కర్‌ను రెండు రోజులు విచారణకు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



ఆడియో రిలీజ్ దృశ్యం

44 మంది నటులు ... 41 రోజుల్లో చిత్రీకరణ పూర్తి

'వాస్కోడగామ' దర్శకుడు ఆర్జీకే

నకుల్ హీరోగా తాను రూపొందించిన 'వాస్కోడగామ' చిత్రాన్ని 44 మంది నటులతో 41 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసినట్టు దర్శకుడు ఆర్జీకే తెలిపారు. ఈ సినిమాను 5656 ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత దత్తో బి.సు భాస్కరన్ నిర్మించారని పేర్కొన్నారు. సీనియర్ నటి దేవయాని ఇందులో ముఖ్య పాత్రను పోషించగా, ఇతర పాత్రల్లో కేఎస్ రవికుమార్, అర్థనా బిను, వంశీ కృష్ణ, ఆనంద్ రాజ్, మన్సూర్ అలీఖాన్, మునీష్‌కాంత్, రెడిన్ కింగ్‌స్లీ, ప్రేమ్ కుమార్, బడవ గోపి, నమో నారాయణ, రవి మారియ తదితరులు నటించారు. అరుణ్ ఎన్‌వీ సంగీతం అందించారు. ఆగస్టు 2న ఈ సినిమాను విడుదల చేయనున్నారు. దీన్ని పురస్కరించుకుని, ఆడియో, ట్రైలర్‌ను చెన్నైలో తాజాగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఆర్జీకే మాట్లాడుతూ... 'చిత్ర పరిశ్రమలో నాకు తెలిసిన వ్యక్తి రజనీ మాత్రమే. ఆయన్ను చూస్తూనే అన్నీ నేర్చుకున్నా. 40 యేళ్ల నకుల్‌తో హీరో పాత్రను చేయించాను. 44 నటులతో 41 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. మేం అనుకున్న విషయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాం. ఆ కంటెంట్ కచ్చితంగా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. ఆడియన్స్ పల్స్‌కు అనుగుణంగా రూపొందించాం. సినిమాను చూసిన తర్వాత మీడియా మిత్రులు బాగుంటే బాగుందని, లేదంటే లేదని రివ్యూల్లో స్పష్టంగా రాయండి' అని పేర్కొన్నారు. నటి దేవయాని మాట్లాడుతూ... 'హీరో నకుల్‌కు నాకు మంచి అనుబంధం ఉంది. మా ఇంటి పిల్లోడు. నా చిన్నతమ్ముడు. అతనిలో మంచి ప్రతిభదాగి వుంది. నేను నకుల్ అభిమానిని. 'బాయ్స్' చిత్రం ద్వారా అతనిపై ప్రేమ పెంచుకున్నాను. ఆ సినిమాలో అద్భుతంగా నటించాడు. మంచి స్టోరీ, మంచి దర్శకుడి కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఆర్జీకే లభించారు. ఈ సినిమాను మొత్తం నకుల్ తన భుజాలపై మోశాడు. కచ్చితంగా మంచి బ్రేక్ ఇస్తుంది' అన్నారు. హీరో నకుల్ మాట్లాడుతూ... 'నా జీవితం అనేక మలుపులు తిరుగుతోంది. 'బాయ్స్' చిత్రంలో అనుకోని విధంగా అవకాశం వచ్చింది. చాలాకాలం తర్వాత మళ్లీ మరోమంచి సినిమాలో నటించాను. 'వాస్కోడగామ' సినిమా ప్రతి ఒక్కరినీ కడుపుబ్బ నవ్విస్తుంది. స్టోరీ నరేట్ చేసే సమయంలోనే దర్శకుడు పడిపడి నవ్వారు. తెరపై కూడా ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పారు. ఎన్నో క్లిష్టపరిస్థితులు ఎదురైనా దర్శకుడు మాత్రం ధైర్యం కోల్పోకుండా చిత్రాన్ని పూర్తి చేశారు' అని అన్నారు.

చిత్రజ్యోతి

ఆగస్టు 15న విక్రమ్ 'తంగలాన్' రిలీజ్


'తంగలాన్'లో విక్రమ్

పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ నటించిన 'తంగలాన్' చిత్రాన్ని ఆగస్టు 15వ తేదీన విడుదల చేయనున్నట్టు దర్శక నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా స్టూడియో గ్రీన్ పతాకంపై నీలం ప్రొడక్షన్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. నిజానికి జనవరి 26న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. అనివార్య కారణాలతో వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న థియేటర్లలో విడుదల చేయనున్నట్టు నిర్మాత వెల్లడించారు. 'పొన్నియిన్ సెల్వన్' చిత్రం తర్వాత విక్రమ్‌కు చెప్పుకోదగిన విజయాలు లేవు. దీంతో 'తంగలాన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కోలార్ గోల్డ్ ఫీల్డ్ నేపథ్యంలో సాగే పీరియాడికల్ డ్రామాగా రూపొందించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, మాళవిక మోహనన్, పార్వతి, పశుపతి కీలక పాత్రలను పోషించారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకున్న విషయం తెల్సిందే. అలాగే, ఈ నెల 17న తొలి లిరికల్ సింగిల్‌ను విడుదల చేయగా, సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది.


కమల్, విజయ్

విజయ్ చిత్రంలో కమలహాసన్ అతిథి పాత్ర?

స్టార్ హీరో విజయ్ చిత్రంలో విశ్వనటుడు కమలహాసన్ అతిథి పాత్రను పోషించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఈ ఇద్దరు నటీనటులు తమతమ ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్నారు. వెంకట్ ప్రభు రూపొందించిన 'ది గోట్' చిత్రంలో విజయ్ నటిస్తున్నారు. ఆ తర్వాత హెచ్.వినోద్ దర్శకత్వంలో మరో చిత్రంలో నటించేందుకు కమిట్ అయ్యారు. అలాగే, కమల్ కూడా మణిరత్నం దర్శకత్వం వహిస్తున్న 'థగ్‌లైఫ్' సినిమాలో నటిస్తున్నారు. అయితే, హెచ్.వినోద్ దర్శకత్వంలో కమల్-233 రూపొందాల్సి ఉంది. అనివార్య కారణాలతో ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు. ఇపుడు కమల్‌కు చెప్పిన స్టోరీతోనే విజయ్‌తో హెచ్.వినోద్ సినిమా చేస్తున్నారు. ఇది విజయ్ నటించే 69వ చిత్రం. ఇందులో కమల్ అతిథి పాత్రను పోషించనున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఈ వార్తలు నిజమైతే.. విజయ్ - కమల్ కలిసి తొలిసారి నటించే తొలి చిత్రం ఇదే అవుతుంది.

గ్రామీణ ప్రజల జీవితాల ఆధారంగా 'వీరాయి మక్కల్'

గ్రామీణ ప్రజల నిజజీవితాలను ఆధారంగా చేసుకుని తెరకెక్కించిన చిత్రం 'వీరాయి మక్కల్' ఏ వైట్ స్క్రీన్ ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత ఎస్.సురేష్ నిర్మాణంలో నాగరాజ్ కరుప్పయ్య దర్శకత్వంలో రూపుదిద్దుకుంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానున్న ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ దర్శకుడు పేరరసు మాట్లాడుతూ... 'తమిళ చిత్రపరిశ్రమకు ఇలాంటి సినిమాలు అవసరం. ఇలాంటి మూవీలు చూడడం అరుదు. ఇపుడు వచ్చే సినిమాల్లో మానవ సంబంధాలు చూపించడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి సినిమాను నిర్మించిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. మంచి కంటెంట్‌తో వచ్చే చిన్న సినిమాలను కూడా ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు నాగరాజ్ కరుప్పయ్య మాట్లాడుతూ... 'నేను పుట్టి పెరిగిన ప్రేమ, కోపం, జీవితం వంటి అంశాలతో రూపొందించా. ఇది ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నా. ఏడేళ్ల తర్వాత తొలిసారి దర్శకుడిగా అవకాశం లభించింది. ఇందులో ప్రధాన పాత్రను పోషించిన మారిముత్తు నటన చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఆయన నటనతో పాటు సినిమా స్టోరీ కూడా ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకుతుంది' అని పేర్కొన్నారు. కాగా, ఈ మూవీలో వేల రామమూర్తి, దివంగత మారిముత్తు, దీపా శంకర్, సురేష్ నందా, నందన, రమా, పాండి అక్కా తదితరులు నటించారు. దీపన్ చక్రవర్తి సంగీతం అందించారు.


'వీరాయి మక్కల్' ఆడియో రిలీజ్ దృశ్యం



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త గృహ సముదాయాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

కొత్త గృహసముదాయాల ప్రారంభం

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పట్టణ నివాసాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రూ.924 కోట్లతో నిర్మించిన గృహ సముదాయాలు, వాణిజ్య సముదాయాన్ని సీఎం స్టాలిన్ సోమవారం ఉదయం ప్రారంభించారు. రాష్ట్ర పట్టణ నివాసాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.541.32 కోట్లతో నిర్మించిన 4,184 గృహ సముదాయాలు, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రూ.382.84 కోట్లతో నిర్మించిన 1,489 ప్రభుత్వ ఉద్యోగుల అద్దె నివాస గృహాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.ముత్తుసామి, దామో అన్బరసన్, ఎం.సుబ్రమణ్యం, ఎస్ఎస్.శివశంకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ మోహన్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సీఎంకే రెడ్డి, ఏఐటీఎఫ్ నిర్వాహకులు

విద్యా ప్రదాత మోహన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

- వర్ధంతి సభలో వక్తలు

ప్యారీస్, జూలై 22: అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) ప్యాట్రన్, శ్రీ కనకదుర్గ తెలుగు పాఠశాలల వ్యవస్థాపకుడు డాక్టర్ చిల్లకూరు మోహన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. మోహన్‌రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఏఐటీఎఫ్ ఆధ్వర్యంలో చెన్నైలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొరట్టూరులోని మోహన్ గార్డెన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఏఐటీఎఫ్ అధ్యక్షుడు, ఎస్కేడీటీ పాఠశాలల ఛైర్మన్ డాక్టర్ సీఎంకే రెడ్డి, డాక్టర్ సీఎం కిషోర్, నాయకర్ నందగోపాల్, గొల్లపల్లి ఇశ్రాయేలు, శంకరన్, లయన్ జి.మురళి, డాక్టర్ ఎన్.నాగభూషణం, సంగీత దర్శకుడు ఎమ్మార్ సుబ్రమణ్యం, ఊటుకూరు దేవదానం, నిర్మల్ చందర్, మునిఆర్ముగం, ఎస్కేడీటీ పాఠశాలలో ఏహెచ్ఎం ఎం.మోహననాయుడు, తమిళ మానిల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వీబీ జవహర్‌బాబు తదితరులు మోహన్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం, వస్త్ర దానం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

కల్లు విక్రయాలను ఎందుకు అనుమతించకూడదు?

- ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్లు విక్రయాలను ఎందుకు అనుమతించకూడదని మద్రాసు హైకోర్టు ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. చెన్నైకి చెందని మురళీధరన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆ పిటిషన్‌లో సమాచార హక్కుల చట్టం కింద తనకు లభించిన సమాచారం ప్రకారం 2020-21లో రూ.39,760 కోట్లు, 2021-22లో రూ.43,421 కోట్లు మద్యం విక్రయం ద్వారా లభించినట్లు టాస్మాక్ సంస్థ ప్రకటించిందని, అదే సమయంలో ఆ రెండేళ్లలో రూ.161 కోట్లు, రూ.69 కోట్ల చొప్పున నష్టాలు కూడా వచ్చాయని తెలిపిందని మురళీధరన్ పేర్కొన్నారు. ఇక టాస్మాక్ సంస్థకు మద్యం రకాలను సరఫరా చేసే సంస్థలు చాలావరకు అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చెందినవారివిగానే ఉన్నాయని, దీనితో టాస్మాక్ సంస్థ కొన్ని నిర్దేశిత రకాలకు చెందిన మద్యాలను మాత్రమే విక్రయిస్తోందన్నారు. రాష్ట్రంలో విక్రయించే మద్యం నాణ్యత కంటే ఇతర రాష్ట్రాలలో విక్రయించే మద్యం రకాలు నాణ్యమైనవిగా ఉన్నాయని తెలిపారు. ఇక టాస్మాక్ దుకాణాల్లో మద్యం ధరలను బాటిల్‌కు రూ.10 నుంచి రూ.50 దాకా పెంచి విక్రయిస్తున్నారని, ఆ అమ్మకాల వల్ల లభించే కోట్లాది రూపాయలను టాస్మాక్ దుకాణం సేల్స్‌మెన్, మేనేజర్లు, ఆ శాఖ మంత్రి పంచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మద్యం సీసాలపై ముద్రించిన ధరకంటే అధిక ధరలకు విక్రయించకూడదంటూ అన్ని టాస్మాక్ దుకాణాల వద్ద ప్రకటన బోర్డులు ఉంచాలని, కల్లువిక్రయాలపై విధించిన నిషేధాన్ని తొలగించి, మళ్లీ కల్లు అమ్మకాలను ప్రోత్సహించాలని, కొన్ని షరతులకు లోబడి కల్లుగీతను అనుమతించి వాటిని విక్రయించేలా ఉత్తర్వు జారీ చేయాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఇన్‌ఛార్జి న్యాయమూర్తి కృష్ణకుమార్, న్యాయమూర్తి కుమరేశబాబుతో కూడిన ధర్మాసనం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో రాష్ట్రంలో కల్లుగీతపై నిషేధం తొలగించి వాటిని ఎందుకు విక్రయించకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.



నీలగిరి జిల్లాల్లో పెనుగాలులు

50 ప్రాంతాల్లో కూలిన వృక్షాలు


కూలిన చెట్లను తొలగిస్తున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో గత వారం రోజులుగా కురిసిన కుండపోత వర్షాలు ఆగినా జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ వీచిన పెనుగాలులకు రహదారులలో చెట్లు కూలాయి. దీంతో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలుచోట్ల మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. ఊటీలోని తీట్టుకల్ వద్ద, బ్లూ మౌంటెన్ రోడ్డులో ఎత్తయిన చెట్లు కూలాయి. తీట్టుకల్ వద్ద ఓ చెట్టు లారీపై పడటంతో ఆ వాహనం ధ్వంసమైంది. బొటానికల్ పార్కు ఎదుట, కోత్తగిరి కట్టబెట్టు వద్ద చెట్లు కూలాయి. ఇలా ఒకే సమయంలో పలుచోట్ల చెట్లు కూలడంతో అధికారులు, అగ్నిమాపక దళం సభ్యులు యంత్రపు రంపాలతో చెట్ల తొలగింపు పనుల్లో పాల్గొన్నారు. ఇలా పలుచోట్ల చెట్లు కూలడంతో ఊటీ, కున్నూరు, కోత్తగిరి, కుందా తాలూకాల్లో సోమవారం పాఠశాలలకు కలెక్టర్ లక్ష్మీభవ్యా సెలవు ప్రకటించారు. ఇక ఊటీ సమీపం కేత్తి సమీపంలో పట్టాలపై ఎత్తయిన చెట్టు కూలడంతో కొండ రైలు సర్వీసును రద్దు చేశారు.

పన్నావాడిలో దోనెల సఫారీ ప్రారంభం


పన్నావాడి వద్ద దోనెలో మేట్టూరు కొళత్తూరుకు బయలుదేరుతున్న స్థానికులు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పన్నావాడి రేవులో సోమవారం ఉదయం నుంచి దోనెల సవారీ ప్రారంభమైంది. ధర్మపురి జిల్లాకు చెందిన ప్రజలు కర్ణాటక రాష్ట్రం మాతేశ్వరన్‌మలై ఆలయానికి, మేట్టూరు కొళత్తూరుకి వెళ్లి వచ్చేందుకు కావేరి నదిని దాటి మేట్టూరు సమీపం కొళత్తూరు మీదుగా వెళుతుంటారు. ఈ నేపథ్యంలో జూన్ నుంచి మేట్టూరు డ్యాంలో నీరడుగంటిపోవడంతో వీరంతా ద్విచక్ర వాహనాలలో వెళ్తుండేవారు. మేట్టూరు జలాశయంలో నీటిమట్టం విపరీతంగా పెరగటంతో కొళత్తూరు, పన్నవాడి దోనెల సవారీ రేవు నుంచి ధర్మపురి జిల్లా పెన్నాగరం, నెరుప్పూరు, ఏరియూరు, నాగమరై ప్రాంతాల్లో వెళ్లేందుకు దోనెల సవారీని మళ్లీ ప్రారంభించారు. దోనెలతోపాటు మరపడవలలోను ఈ ప్రాంతాలకు ప్రజలు ప్రయాణిస్తున్నారు. కర్ణాటకలోని జలాశయాలన్ని నీటితో నిండి పొంగి ప్రవహిస్తుండటంతో ఆ జలాలు మేట్టూరు డ్యాంలోకి చేరుతున్నాయి. దీనితో కావేరి వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కావేరి వాగు పరవళ్లను వీక్షించడానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడుతున్నారు.


చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న జపాన్‌లోని ఒసాకా ప్రావిన్స్ డిప్యూటీ గవర్నర్ యమగూచి నొబుహికో, చెన్నైలోని జపాన్ కాన్సులేట్ జనరల్ టకాహషి మునియో

75 అడుగులు దాటిన మేట్టూరు డ్యాం నీటిమట్టం

పెరంబూర్, జూలై 22: కర్ణాటక డ్యాంల నుంచి విడుదల చేస్తున్న అదనపు జలాలతో సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాం నీటిమట్టం 75 అడుగులకు చేరుకుంది. డ్యాంకు ఇన్‌ఫ్లో 64,033 ఘనపుటడుగులుండగా, తాగునీటి అవసరాల కోసం 1,000 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. నీటి రాక ఇలాగే కొనసాగితే మరో వారంలో డ్యాం 100 అడుగులకు చేరుకునే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం లెక్కల ప్రకారం నీటి మట్టం 70.80 అడుగులుగా ఉండగా, సోమవారానికి ఇది 75 అడుగులకు చేరుకుంది. డ్యాంలో మొత్తం 37.20 టీఎంసీల నీరు నిల్వవుంది.

బంగ్లాదేశ్ నుంచి తిరిగొచ్చిన విద్యార్థులు

- స్వాగతం పలికిన మంత్రి సెంజి మస్తాన్

అడయార్, జూలై 22: రిజర్వేషన్ విధానం కారణంగా పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో చెలరేగిన అల్లర్లలో చిక్కుకున్న 39 మంది తమిళ విద్యార్థులు చెన్నైకి క్షేమంగా చేరుకున్నారు. వీరంతా ఉన్నత చదువుల కోసం వెళ్లిన విషయం తెల్సిందే. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో అల్లర్ల కారణంగా ఇతర దేశాలకు చెందిన పౌరులు తమతమ దేశాలకు వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు ఉన్నత చదవుల కోసం వెళ్లిన విద్యార్థులు ఢాకాలో చిక్కుకున్నారన్న విషయం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని, అధికారులను అప్రమత్తం చేశారు. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు ఢాకాలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదించి, మొత్తం 39 మంది తమిళ విద్యార్థులు చెన్నైకు వచ్చేలా చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి 8 గంటలకు వచ్చిన ఇండిగో విమానంలో 18 మంది, రాత్రి 9.30 గంటలకు వచ్చిన ఎయిర్ ఇండియా విమానంలో 21 మందితో నగరానికి చేరుకున్నారు. వీరికి రాష్ట్ర తమిళ సంక్షేమ, విదేశాల్లో నివసించే తమిళ ప్రజల పునరావాసం విభాగం అధికారులతో పాటు రాష్ట్ర మంత్రి సెంజి మస్తాన్‌లు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఆ తర్వాత విద్యార్థులకు వారివారి స్వస్థలాలకు వెళ్ళేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.


చెన్నై విమానాశ్రయం వద్ద విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న సెంజి మస్తాన్